ఎట్టకేలకు నెరవేరిన ప్రజాకాంక్ష

- డంపింగ్ యార్డ్, శ్మశానం రోడ్డుకు మోక్షం
- రూ.85 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి



అమలాపురం కంపోస్టు యార్డు, శ్మశానానికి వెళ్లేందుకు విశాలంగా నిర్మించిన సీసీ రోడ్డు

అమలాపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో పంట కాల్వ చెంతన ఉన్న డంపింగ్ యార్డ్, శ్మశాన వాటిక రోడ్డు సమస్యలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మున్సిపాలిటీ ఈ రోడ్డును రూ.85 లక్షలతో ఆధునీకరించడమే కాకుండా పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసింది. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ ఈ రోడ్డు నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, సంబంధిత వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణలు పలుమార్లు రోడ్డును పరిశీలించి నాణ్యతా ప్రమాణాల విషయంలో సూచనలిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేశారు.

నాడు మొత్తుకున్నా మోక్షం కలగలే

గతంలో డంపింగ్ యార్డ్, శ్మశానవాటికలకు వెళ్లడానికి గ్రావెల్ రోడ్డు ఉండేది. అది పూర్తిగా శిథిలమై రోడ్డుపై ప్రయాణించడం సంగతి పక్కనబెడితే తలచుకుంటేనే ప్రజలు భయపడిపోయేవారు. దీనికి తోడు పట్టణంలోని 30 వార్డులకు సంబంధించి రోజూ సేకరించే 35 టన్నుల చెత్తను మున్సిపల్ ట్రాక్టర్లు ఈ రోడ్డు మీదుగానే తీసుకొస్తాయి. మరోవైపు మున్సిపాలిటీలో 15 వార్డులకు చెందిన ప్రజలు వినియోగించుకునే శ్మశానానికి సైతం ఇదే దారి కావడంతో చనిపోయిన వారికి అంతిమయాత్ర నిర్వహించడానికి వెళ్లేటప్పుడు ప్రత్యక్ష నరకం కనిపించేది. ఈ రెండు సమస్యలతో ఆ 15 వార్డుల ప్రజలు గత ప్రభుత్వంలోని మున్సిపల్ కౌన్సిల్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పరిష్కారం లభించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కౌన్సిల్ చొరవ తీసుకుని సమస్య తీవ్రతను గుర్తించి సీసీ రోడ్డును నిర్మించింది. ఇదే రోడ్డులో చెత్త కొండలను కరిగించేందుకు చెత్త శుద్ధీకరణ ప్లాంట్ కూడా రావడంతో ప్లాంట్ నిర్వహణకు కూడా రోడ్డు అనువుగా మారింది. అటు కంపోస్ట్ యార్డు, ఇటు పంట కాల్వ మధ్య విశాలంగా దాదాపు 440 మీటర్ల మేర నిర్మించిన సీసీ రోడ్డుతో స్థానికులకు ఉపశమనం లభించింది. ఇదే సీసీ రహదారిలో ఉన్న కైలాస భూమి భవనానికి రూ.4 లక్షల మున్సిపాలిటీ నిధులతో రంగులు వేసి ముస్తాబు చేశారు.

> **సీసీ రోడ్డు ప్రారంభానికి ఏర్పాట్లు**
>
> రూ.85 లక్షలతో విశాలంగా సీసీ రోడ్డు నిర్మించాం. త్వరలోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుల చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రోడ్డు నిర్మాణం వల్ల ఏళ్ల తరబడి ఉన్న రెండు ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది.
>
> – ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

మత్స్యకార భరోసా అన్ని నియోజకవర్గాల్లో అమలుచేయాలి

మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు



డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు తదితరులు

అమలాపురం రూరల్: మత్స్యకార భరోసా కేవలం ముమ్మిడివరం నియోజకవర్గంలోనే కాకుండా అమలాపురం, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని పుదుచ్చేరి ఢిల్లీ అధికార ప్రత్యేక ప్రతినిధి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. అమలాపురంలోని ఎత్తురోడ్డు వద్ద ఆదివారం జరిగిన అగ్నికుల క్షత్రియ ఆత్మీయ కలయిక, కార్తిక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సముద్రంలో చమురు, సహజ వాయు సంస్థల కార్యకలాపాల వల్ల మత్స్య సంపదకు అపార నష్టం వాటిల్లుతోందన్నారు. అమలాపురం తాలూకా సంఘానికి స్థలమున్నా భవన నిర్మాణం లేదని తాలూకా సంఘ అధ్యక్షుడు పెమ్మాడి సాయిబాబు సభ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి భవన నిర్మాణానికి రూ.50 లక్షల సీఎస్ఆర్ ఫండ్ ద్వారా విడుదల చేయిస్తానని మల్లాడి తెలిపారు. లేని పక్షంలో తమ ఫౌండేషన్ నిధులు వెచ్చించి భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, బొమ్మిడి నాయకర్, నాగిడి నాగేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ కొల్లు త్రినాథ్‌వర్మ, ధర్మాడి వీర్రాజు, పోతాబత్తుల ఆంజనేయులు, చింతా మహానాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం అందజేసేందుకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలోని పిల్లలకు సోమవారం నుంచి భోజనాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ, ఐసీడీఎస్, వెలుగు అధికారులతో అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. తూర్పులంక, తాడికోన, తాళ్లచెరువు, డి.రావులపాలెం, పెదాంధ్రపేట ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 69 మంది పిల్లలకు అన్నం, ఉడికించిన గుడ్డుని అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుధ్యంపై ఆయా కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కేంద్రాల్లో స్టాక్ ఉండేలా ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లోని పిల్లలకు భోజనాన్ని అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కిరణ్‌కుమార్, ఏడుకొండలు, ఏపీఎం సయ్యద్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నీషా, భారతి, కుమారి పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలతో శోభాయాత్ర



అయోధ్య అక్షతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల అప్పన్న చెరువు వద్ద వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయం నుంచి అయోధ్య అక్షతలను కలశాలలో నింపుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలకు శోభాయాత్ర నిర్వహించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామి దర్శనం చేసుకుని కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్ మాట్లాడుతూ వచ్చే నెల 22న అయోధ్య రామమందిరంలో రాముడు కొలువుదీరనున్నాడన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐదు లక్షలకు పైగా దేవాలయాల్లో అయోధ్య రామ మందిరంలో మహాభిషేక కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారని చెప్పారు. శోభాయాత్రలో గాదిరాజు విశ్వనాథరాజు, నూలు వల్లీ తాయారు, నాగరాజు, సలాది శ్రీనివాసరావు, బొంతు కనకారావు, ఏలూరి రాంబాబు, విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలకు పూజాధికాలు

అమలాపురం రూరల్: అయోధ్య శ్రీరామ మందిర ప్రతిష్ఠలో పూజించిన అక్షతలకు పూజాధికాలు నిర్వహించి ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ చేతుల మీదుగా భక్తులకు అందించారు. కామనగరువు విత్తనాలవారి కాలవ గట్టున గల గణేష్‌నగర్ రామాలయం వద్ద అక్షతలతో శోభాయాత్ర నిర్వహించి వివిధ వార్డులకు, పంచాయతీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బులుసు జగదీష్, కె.గోపాలకృష్ణ, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం




ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1988 బ్యాచ్ నవోదయ విద్యార్థులు

నవోదయలో ఆత్మీయ సమ్మేళనం

యానాం: వారంతా చిన్ననాడు తాము చదువుకున్న చదువులమ్మ చెట్టు నీడకు చేరుకున్నారు. విలువలతో కూడిన విద్య నేర్పి తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను కలుసుకుని తాము చేసిన అల్లరి చేష్టలను గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి తమ స్నేహితులతో రోజంతా ఆనందంగా గడిపారు. 1988లో యానాం జవహర్ నవోదయ విద్యాలయలో చదువుకుని దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నవోదయ విద్యాలయలో జరిగింది. ఈ అపూర్వ సమ్మేళనానికి సుమారు 120 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అలుమిని ఉద్దేశాన్ని వివరిస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు వివిధ రంగాల్లో పూర్వ విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించారు. యానాం నవోదయ దేశం గర్వించదగ్గ నవోదయల్లో ఒకటిగా ఉందన్నారు. నేటి యువత తమ శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆవరణలో ఐలవ్‌జేఎన్‌వీ యానాం సెల్ఫీ బోర్డును ప్రారంభించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేగం, రిటైర్డ్ తెలుగు టీచర్ ఆర్‌వీ శర్మ, ఉపాధ్యాయులు ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయంగా బ్రాహ్మణుల వన సమారాధన



వన సమారాధన సభలో మాట్లాడుతున్న రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు

అమలాపురం టౌన్: స్థానిక ఏఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కోనసీమ స్థాయి బ్రాహ్మణుల వన సమారాధన ఆదివారం ఆత్మీయ వాతావరణంతో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు రాష్ట్ర జ్యూడిషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బులుసు శివశంకర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు, సుప్రీం కోర్టు న్యాయవాది కె.సుందర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బ్రాహ్మణుల ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు. తొలుత ముఖ్య అతిథులు ఉసిరి చెట్టుకు పూజలు చేసి వన సమారాధనను ప్రారంభించారు. బ్రాహ్మణులంతా కుటుంబ సమేతంగా వచ్చి ఈ వేడుకలో పాలు పంచుకున్నారు. ఆట పాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కొత్తూరి శ్రీనివాస్, విస్సాప్రగడ చిన్న, జిల్లెళ్ల గోపాల్, డీవీఎస్ మూర్తి(బాబి), తోపెల్ల సుబ్రహ్మణ్యం, పుల్లేవు చందు, ఆకొండి పవన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: 41వ జాతీయ పెన్షనర్స్ డే మహోత్సవాన్ని ఆదివారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన కార్యక్రమానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవలే రిటైరైన విశ్రాంత ఉద్యోగులు పాలెపు తాతారావు, కంచి సత్యనారాయణమూర్తి, కొప్పిశెట్టి సూర్యారావు, దడాల ధనరాజు, బళ్ల అప్పారావు, కట్టా సరోజిని, బర్రే సుబ్బలక్ష్మి, ఓలేటి కాంతం, కావూరి సరోజినిదేవి, పోతాబత్తుల సత్యవతిలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కేవీ రామకృష్ణయ్య, కార్యదర్శి ఏవీవీ సత్యనారాయణ, కోశాధికారి దడాల వెంకన్న, గెద్దం భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



మురమళ్లలో జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



విశేష పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

ఐ.పోలవరం: షష్ఠి మహోత్సవాల్లో భాగంగా మురమళ్ల, తిళ్లకుప్ప గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మురమళ్లలో జరిగిన కల్యాణ మహోత్సవంలో నాగభట్ల శ్రీరాం దంపతులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. తిళ్లకుప్పలో పుసులూరి వంశీకులచే కల్యాణం జరిగింది. గుత్తినదీవి–వేమవరంలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామోత్సవం చేశారు. మండలంలోని మురమళ్ల, తిళ్లకుప్ప, గుత్తినదీవి–వేమవరం, ఐ.పోలవరం, కొమరగిరి గ్రామాల్లో ఉన్న ఆలయాల వద్ద షష్ఠి మహోత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా ఆలయాల వద్ద పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అల్లవరం: సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి పురస్కరించుకుని బోడసకుర్రులో కొలువైయున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంత్ కామేశ్వర్ ఆధ్వర్యంలో బావిశెట్టి భీమేశ్వరరావు, పద్మావతి దంపతులచే స్వామి వారికి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. పూజా కార్యక్రమాల్లో కలిగినీడి ఉదయభాస్కర్, మొయిల గణపతి, ఐలా నాగేశ్వరరావు, శిష్టా సూరిబాబు, ఎం.ఏసునాయుడు, కలిగినీడి రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం జరిగే షష్ఠి వేడుకలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామంలోని గూడా హరిశ్చంద్రుడుకు చెందిన కొబ్బరితోటలో బూడిద గుమ్మిడిపాదులో సుబ్రహ్మణ్యస్వామి వెలిశాడని కొన్ని దశాబ్దాల క్రితం ఆ ప్రాంతంలో స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. గుమ్మడి సుబ్రహ్మణ్య స్వామి, సంతాన సుబ్రహ్మణ్య స్వామిగా పేరుగాంచిన స్వామి దర్శనం చేసుకుంటే సంతానం కలుగుతుందని, వివాహం కాని వారికి వివాహమవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడ ఉన్న 42 అడుగుల బాల సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలి వస్తారు. ఆదివారం రాత్రి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి షష్ఠి తీర్థం, రథోత్సవం జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపెల్ల రామం తెలిపారు.

యానాం: పట్టణంలో కొలువైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కల్యాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరై విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు దేవస్థానం అధికారి ఖండవల్లి రామకృష్ణ, ఆలయ అర్చకులు శివ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఉత్సవంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాళ్లరేవు: సమాజానికి లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్‌లు అన్నారు. ఆదివారం రంగనాయకపురం ఎంటీ రాజు బంగ్లాలో నిర్వహించిన జోన్ సోషల్ కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన కుడుపూడి శివన్నారాయణ, దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు మాట్లాడుతూ క్లబ్ సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ జోన్–3 చైర్మన్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, లింగమల్లు కృష్ణమూర్తి, ఈవీవీ ఈశ్వరకుమార్, నడింపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగింపు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నవంబర్ 16న నవజాతి శిశువు మృతి చెందిన ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను ఇద్దరు వైద్యులు, ఒక అంబులెన్స్ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగిస్తూ పుదుచ్చేరి వైద్యశాఖ డైరెక్టర్ శ్రీరాములు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. స్పెషలిస్ట్ పీడియాట్రిక్స్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జి.క్రాంతికుమార్, ఎన్ఆర్‌హెచ్ఎంలో స్పెషలిస్ట్ ఇన్ పీడియాట్రిక్స్ డాక్టర్ కె.కిశోర్, అంబులెన్స్ డ్రైవర్ మల్లాడి ఆదినారాయణలను విధుల నుంచి తొలగించారు.

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సమావేశం



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ ముమ్మిడివరం శాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. సమావేశానికి రెడ్డి వీరాస్వామి అధ్యక్షత వహించారు. తొలుత తమకు ఆరాధ్యుడైన డీఎస్ నకారా చిత్రపటానికి పలువురు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు పొత్తూరి వెంకట కృష్ణంరాజు, జనిపెల్ల కృష్ణమూర్తి, కట్టా శ్రీరామమూర్తిలను సత్కరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామకృష్ణ, వైవీ రమణమూర్తి, జనిపెల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు

తాళ్లరేవు: పవిత్ర ధనుర్మాస పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు తెల్లవారుజామునే స్వామివారికి మేలుకొలుపు, అర్చన, అలంకరణ నిర్వహించారు. కేశవపురంలోని శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయం, పి.మల్లవరం, చొల్లంగి గ్రామాల్లో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో ధనుర్మాస పూజలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ




భైరవస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయితీ పరిధి పేరాయిచెరువులో ఇటీవల మృతి చెందిన పెయ్యిల భైరవస్వామి కుటుంబాన్ని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా భైరవస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య వెంకాయమ్మ, కుమారుడు స్వామినాయుడులను మంత్రి విశ్వరూప్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా వైస్ చైర్మన్ పెయ్యిల రమణ, ఉంద్రు వెంకటేశ్వరరావు, పెయ్యిల దుర్గారావు, చిట్టిబాబు తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.7.70 లక్షలతో భీమనపల్లి, సూదాపాలెం ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ రాజ్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దశల వారీగా గ్రామంలో అవసరం ఉన్న చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సత్యకృష్ణ, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సగం ఉడికిన గుడ్లు



విద్యార్థులకు ఇచ్చిన ఉడకని గుడ్లు

అల్లవరం: గోరు ముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రుపాయిలు ఖర్చు చేస్తుంటే కొన్నిచోట్ల మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇష్టానుసారంగా వండి వడ్డిస్తున్నారు. దేవగుప్తం పంచాయతీ పరిధిలోని కర్రిచెరువులోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు ఉడికీ ఉడకని గుడ్లు అందించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భోజన నిర్వాహకురాలు ఎలిపే సత్తెమ్మ సగం ఉడికిన గుడ్లు అందించడంతో విద్యార్థులు వాటిని పాఠశాల ఆవరణలోనే పాడేశారు. వాటిని కుక్కలు తింటుంటే గ్రామస్తులు గమనించి నిర్వాహకుల్ని నిలదీశారు. అధికారులు పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాస్టర్ గాబ్రియేల్ మృతికి సంతాపం

అమలాపురం రూరల్: మండల కో ఆప్షన్ సభ్యుడు, పాస్టర్ మోసలి స్పర్జన్ రాజు తండ్రి పాస్టర్ గాబ్రియేల్ మృతికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం రంగాపురంలో పరామర్శించారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలో రాజమహేంద్రవరం, ఓడలరేవు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీంలో డిసెంబర్ తొలి పక్షం రోజులకు గాను లక్కీ డ్రా ఆదివారం తీశారు. రాజమహేంద్రవరం రూటులో అంబాజీపేటకు చెందిన కె.సాయిమణి, ఓడలరేవు పల్లె వెలుగు రూటులో ఓడలరేవుకు చెందిన కీర్తన బహుమతులు సాధించారు. సాయికృష్ణ బ్యాగ్స్ యజమాని జి.ప్రసాద్ సమకూర్చిన బహుమతులను అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ప్రతిమాకుమారి, ఓఆర్‌పీఆర్ ఇన్‌చార్జ్ వరహాలబాబు, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ



అశోక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు కుడిపూడి అశోక్‌ను ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. అశోక్ ఇటీవల అస్వస్థతకు గురై రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాది కుడిపూడి త్రినాథరావు, సర్పంచ్ దాసరి అరుణకుమారి తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరులో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం శంకుస్థాపన చేశారు. బీసీ కల్యాణ మండప నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. దూడల వారి వీధిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రజకపేటలో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దంగేటి దోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ దాసరి అరుణ, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, దొంగ ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీనివాస్, చొల్లంగి సుజాత, దూనబోయిన శ్రీరంగ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన జిప్‌మెర్ వైద్యులు

యానాం: పట్టణంలో సుమారు రూ.53 కోట్ల ఖర్చుతో నిర్మించిన జిప్‌మెర్ ఆసుపత్రి అవుట్ పేషెంట్ విభాగ సేవలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం పుదుచ్చేరి నుంచి వచ్చిన వైద్యుల బృందం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ అవుట్ పేషెంట్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎముకలు, ప్రసూతి, గైనకాలజీ విభాగాల వైద్యులు ప్రస్తుతం అందుబాటులో ఉంటారన్నారు. పూర్తిస్థాయి వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా జిప్‌మెర్ వైద్యులు డాక్టర్ దిలీప్‌మౌర్య, డాక్టర్ ఆనంద్‌రాజ్, డాక్టర్ పార్వతి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

సంస్కరణ సాహిత్యానికి ఆద్యుడు స్వామినేని

ఐ.పోలవరం: స్వామినేని ముద్దు నరసింహనాయుడు తెలుగు నాట సంస్కరణ ఉద్యమానికి ఆద్యుడిగా నిలిచారని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. స్వామినేని 231వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఐ.పోలవరంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హేమంతకవనం సాహితీ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు పాల్గొని తమ కవితలు వినిపించారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరావు, డాక్టర్ పి.వెంకటేశ్వరావు, దంగుడు బియ్యం నారాయణరావు, వి.లక్ష్మీనారాయణ, రేవు యజ్ఞశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య నిర్లక్ష్య వైఖరి వల్లే కార్మికులకు గాయాలు

యానాం: యానాంలోని రుంగ్తా ఇరిగేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లే ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కంపెనీలో జరిగిన ప్రమాదంలో రాజశేఖర్ అనే కార్మికుడికి కుడి చేయి కాలిపోయిందని, ఈశ్వరరావు అనే మరో కార్మికుడికి చూపుడు వేలు తెగిపోతే సర్జరీ చేసి అతికించారన్నారు. యాజమాన్యం మేన్ పవర్‌ను తగ్గించడం వల్ల కార్మికులపై అదనపు పని భారం పడుతుందని, ప్రమాదాలకు ఇదే కారణమన్నారు.